క్లుప్తంగా

అగస్త్యేశ్వర ఆలయంలో ఘటాభిషేకం



పట్నంబజారు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పాత గుంటూరులోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని జరిపారు. సకాలంలో వర్షాలు పడాలని, పాడిపంటలతో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్ :పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఈనెల 8న మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో జెన్‌ప్యాక్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపల్ ఏబీపీ మనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020–24 వరకు డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో పీజీ కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. వివిధ కళాశాలల్లో డిగ్రీ, బీటెక్, పీజీ, ఎంటెక్ పూర్తి చేసినవారంతా పాల్గొనవచ్చునని చెప్పారు.

అధికారిపై విచారణకు వినతి

లక్ష్మీపురం: గుంటూరు నగర పాలక సంస్థ వెహికిల్ షెడ్‌లో అధికారులు దందా నిర్వహిస్తున్నారని, వెహికల్స్ నిర్వహణ సక్రమంగా జరగటం లేదని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ఆరోపించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెన్న వెంకట కొండారెడ్డి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ హరికృష్ణను సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రం అందజేశారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి ఫోన్‌లో మహిళను బెదిరించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయిబాబా రోడ్డులో నివాసం ఉండే జంపని పూజిత పెదకాకాని మండలం అగతవరప్పాడులోని లక్ష్య కళాశాల నిర్వాహకుడు గుంటక మల్లికార్జునరెడ్డికి గతంలో రూ. 80 లక్షలు అప్పుగా ఇచ్చింది. అందులో రూ. 40 లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగతా సొమ్ము చెల్లించలేదు. మల్లికార్జునరెడ్డికి పూజిత కొద్ది రోజుల క్రితం ఫోన్ చేసి డబ్బులు అడిగింది. ఇవ్వను.. ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించాడు. ఈ మేరకు పూజిత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగి నాగూర్ మీరా మృతి



షేక్ నాగూర్ మీరా (ఫైల్)

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న షేక్ నాగూర్ మీరా సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కమిషనర్ ఎస్.హరికృష్ణ , అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, విభాగాధిపతులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం ప్రకటించారు. నాగూర్ మీరా చిన్న వయస్సులోనే మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి ఇప్పటికే మట్టి ఖర్చులు అందించామని, త్వరలో నగరపాలక సంస్థ నుంచి బెనిఫిట్స్ అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాన్యువల్‌గా పని సర్దుబాటుకు ఎస్టీయూ డిమాండ్

గుంటూరు ఎడ్యుకేషన్ :ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటును ఆన్‌లైన్‌కు బదులుగా మాన్యువల్‌గా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. పెదబాబు, డీకే సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలస్థాయిలో సమర్థంగా చేపట్టాలని కోరారు. జీవో నెంబరు 117 ప్రకారం కాకుండా ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా పని భారం మోపకుండా చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేసిన కారణంగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 6 వేలకుపైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు నెలవారీ ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ రిపోర్టు ఇచ్చేందుకు ఆలస్యమయ్యే అవకాశాలున్న దృష్ట్యా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ విధానం అమలు పర్చాలని కోరారు.

ఎండ... ఎముకలకు అండ

రోజూ సూర్యుడితో కొంత సేపు గడపండి

- ఏసీ గదులకే పరిమితమయితే ప్రమాదమే
- పెరుగుతున్న ఆస్టియోపొరోసిస్ బాధితులు
- పిల్లల్లోనూ కనిపిస్తున్న వ్యాధి లక్షణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్య నిపుణులు
- చిన్నదెబ్బలకే ఎముకలు ఫట్

గుంటూరు మెడికల్: ఉదయం నిద్ర లేచింది మొదలు చీకటి పడే వరకు అసలు సూర్యుడిని ఏ మాత్రం చూడకుండా, సూర్యరశ్మిని శరీరానికి తాకనీయకుండా ఉంటే ఆస్టియో పొరాసిస్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాఠశాలల్లో ఆటలాడుకుంటూ పడిపోయిన పిల్లల్లో కొద్దిపాటి దెబ్బలకే ఎముకలు విరిగిపోవడాన్ని గుర్తించామని సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి తెలిపారు. సూర్యుడి లేత కిరణాలు కొంత సేపు శరీరంపై ప్రసరించడం ద్వారా ప్రకృతి సిద్ధంగా సూర్యుడి నుంచి విటమిన్ డి లభిస్తుంది. చాలా మంది భానుడి ముఖం చూడకుండానే కాలం గడిపేస్తూ ఉండటం, గదుల్లో ఉంటూ ఉద్యోగాలు నిర్వహించటం వల్ల డి విటమిన్ సమస్యల బారిన పడుతున్నట్లు వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఎముకలు విరిగి పెరిగిన మరణాలు

చిన్నచిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవడం ఆస్టియోపొరోసిస్ వ్యాధి సోకినవారిలో కనిపించే ప్రధాన లక్షణం. వయస్సుమీద పడే కొద్దీ అనేక వ్యాధులు సోకి బాధిస్తాయి. వాటిల్లో ఆస్టియోపొరోసిస్ ఒకటి. ఆడవాళ్లలో మెనోపాజ్ దశ దాటిన తరువాత 40 ఏళ్లలో, మగవాళ్లలో 50 ఏళ్ల వయస్సులో ఈ వ్యాధి వస్తోంది.అయితే ఆధునిక జీవనశైలి వల్ల నేడు 35 ఏళ్లకే ఆడవారు, 45 ఏళ్లకే మగవారు ఈ వ్యాధి బారిన పడటంపై వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సూర్యరశ్మి ఏ మాత్రం సోకకుండా ఏసీ గదుల్లో అధిక సమయం ఎక్కువసేపు గడిపేవారు బారిన పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వయో వృద్ధుల్లో 33 శాతం మంది తుంటి ఎముక విరిగి బాధపడుతుండగా వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు మరణిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్సియం లెవల్స్ పెంచాలి. వయస్సు మళ్లిన వారికి విటమిన్ డి, క్యాల్షియం మాత్రలు ఇవ్వాలి. రోగులను ఖాళీగా ఉంచకుండా వారికి ఏదోఒక వ్యాపకం కల్పించాలి. పోషకాహారాన్ని అందించాలి. పొగ, మద్యం తాగడం లాంటి చెడు అలవాట్లు విడనాడాలి. ప్రతిరోజూ తప్పనిసరిగా అరగంట సేపైనా నడవాలి. కీళ్లవాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది కాబట్టి వీరికి ముందస్తుగా పరీక్షలు చేయించాలి.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు.

వ్యాధి లక్షణాలు


వయస్సు పైబడిన వారిలో వళ్లంతా నొప్పులు, ఏ పని చేయలేకపోవడం, నీరసం, నిస్సత్తువ, నిరాశ, ఓపిక లేకపోవడం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేస్తే వెన్నుపూస, చేతిమణికట్టు, తుంటి వద్ద ఏ మాత్రం చిన్నదెబ్బ తగిలినా చివరకు ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి. శారీరక వ్యాయామం ఏ మాత్రం చేయనివారికి, ముఖ్యంగా ప్రతిరోజూ కనీసం అరగంటకూడా నడవకపోవటం వల్ల ఇది సోకుంది. వ్యాధి తీవ్రత పెరినప్పుడు మాత్రమే ఎక్సరే ద్వారా తెలుస్తుంది. ఎముకల సాంద్రత పరీక్ష చేయించడం ద్వారా వ్యాధి సోకే అవకాశం ఉందా లేదా సోకిందా ? అనేవిషయాలు తెలుస్తాయి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ఆస్టియోపొరాసిస్ బాధితులకు ప్రతిరోజూ ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాం. బాధితుల్లో మహిళలే అధికంగా ఉన్నారు.వారు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ప్రతిరోజూ ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల సమయంలో కనీసం 20 నుండి 30 నిమిషాల పాటు లేత సూర్యకిరణాలు శరీరంపై పడేలా కూర్చోవటం చాలా మంచిది.

– డాక్టర్ రమణ యశస్వి, ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్



ఆస్టియోపొరోసిస్ పోస్టర్

బాధితులు అధికమే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం మెనోపాజ్ తరువాత ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు వ్యాధి బారిన పడుతున్నారు.వయస్సు పైబడిన పురుషుల్లోనూ బాధితులు అధికంగా ఉన్నారు. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 300 మంది ఓపీకి వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో వస్తున్నారు. వీరిలో సగం మంది ఆస్టియోపొరోసిస్ బాధితులే. జిల్లాలో 40మంది ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు ఉన్నారు. వీరి వద్దకు ప్రతిరోజూ 5 నుంచి 10 మంది చికిత్స కోసం వస్తున్నారు.

నేడు చుండూరు అమర వీరుల వర్ధంతి సభ

నెహ్రూనగర్: చుండూరు అమర వీరుల 33వ వర్ధంతి సభను మంగళవారం బ్రాడీపేటలో నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. సభ సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పలువురు ప్రొఫెసర్లు, ప్రజాసంఘ వాదులు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిఖాసురేష్, పాగళ్ల సురేష్, మాల్యాద్రి, టి.నరసింహారావు పాల్గొన్నారు.

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రం



పెదకాకాని: మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితమే స్వాతంత్య్రమని ఉపన్యాసకుడు సంగిరెడ్డి హనుమంతరెడ్డి చెప్పారు. పెదకాకాని మండలం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న జెమ్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు భారత స్వాతంత్య్ర ఉద్యమంపై అవగాహన కలిగించారు. కార్యక్రమానికి అవర్ స్టేట్ అవర్ లీడర్ అండ్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు జి శాంతమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి, ఉపన్యాసకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్య్ర పోరాటంలోని వివిధ ఘట్టాలను వివరించారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నగర కమిషనర్ ఎస్. హరికృష్ణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న నగర కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ ఎస్.హరికృష్ణ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా ఆయా కార్యదర్శులు తమ పరిధిలో ప్రజల సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి అందే అర్జీలను ఫైనాన్స్, నాన్ ఫైనాన్స్ అంశాల వారీగా విభజన చేయాలని చెప్పారు. నాన్ ఫైనాన్స్ అంశాల్ని నిర్దేశిత కాలపరిమితితో పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఫైనాన్స్ అంశాల పరిష్కారం కోసం విభాగాధిపతులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 65 ఫిర్యాదులు

సోమవారం ప్రజల నుంచి 65 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 23, ఇంజినీరింగ్ విభాగానికి 20, రెవెన్యూ విభాగానికి ఆరు, ప్రజారోగ్య విభాగానికి తొమ్మిది, ఉపా సెల్ విభాగానికి రెండు, అకౌంట్స్ విభాగానికి ఐదు చొప్పున ఉన్నాయని చెప్పారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ శ్యాం సుందర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఈఈలు, ఆర్ఓలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

చెత్త సేకరణ నిర్దేశిత సమయంలోనే జరగాలి

నెహ్రూనగర్: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు నిర్దేశిత సమయంలోనే చేయాలని కమిషనర్ ఎస్.హరికృష్ణ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. ఆయన సోమవారం అమరావతి రోడ్డు, గోరంట్ల, బృందావన్ గార్డెన్స్, కొరిటెపాడు, లక్ష్మీపురం, బ్రాడీపేట, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించారు. కార్మికులు, కార్యదర్శుల హాజరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు ప్రతిరోజూ ఒకే సమయానికి చెత్త సేకరించాలని చెప్పారు. ప్రజలకు కూడా ఆ సమయంపై అవగాహన కలిగించడం ద్వారా వారు రోడ్లు, కాల్వల్లో వేయకుండా ఉంటారని తెలిపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ తదితర రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ఉండాలని, ప్రధాన రహదార్లు ఉదయం 7 గంటలకల్లా శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంహెచ్‌వో మధుసూదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

13న అంతర్ కళాశాలల పోటీలు



బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: :హిందూ కళాశాల లలిత కళా సమితి, స్టెప్–స్వశక్తి, యువజన సర్వీసుల శాఖ సంయుక్తంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 13వ తేదీన అంతర్ కళాశాలల సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి. మల్లికార్జునప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో పోటీలకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కళాశాల స్థాయి విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, బృందనాట్యం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. ఈనెల 10వ తేదీ లోపు తమ పేర్లను 98481 10174, 96406 80307 ఫోన్ నంబర్లలో నమోదు చేసుకోవాలని కన్వీనర్ డాక్టర్ ఎ.బాలశౌరి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కాళిదాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్, స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి పీవీ రాము తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న నాగభూషణం, సీతారామయ్య, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రధాని మోదీ ప్రతిపాదించిన 'అమ్మ పేరుతో ఒక్క మొక్క' కార్యక్రమాన్ని అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ విద్యార్థులు సోమవారం సంపత్‌నగర్‌లోని శ్రీరామనామ క్షేత్రంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోపాటు అందరికీ ఉపయోగపడేలా మామిడి, తులసి, మారేడు, దానిమ్మ వంటి మొక్కలను నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. సీతారామయ్య, ఫార్మకాగ్నసీ విభాగాధిపతి డాక్టర్ ఎం. రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. మొక్కలు నాటడంలో సహకారాన్ని అందించిన శ్రీరామనామక్షేత్రం నిర్వాహకులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు ధన్యవాదాలు తెలిపారు.

మెకానిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా భవానీశంకర్



భవానీశంకర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నగరంపాలెం: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చందు భవానీశంకర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏటుకూర్ బైపాస్‌లోని అసోసియేషన్ హాల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండున్నరేళ్ల ఈ పదవిలో కొనసాగుతానని చెప్పారు. మెకానిక్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఆయన్ను సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి అధ్యక్షుడు ఉల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులు బహదూర్‌ఖాన్, షేక్ అన్వర్‌బాషా, గుంటూరు టూటౌన్ అధ్యక్షుడు అబ్దుల్ అమీద్, ఉపాధ్యక్షులు సుభాని, కరుణాకర్, కార్యదర్శి సంగం సుభాని, జె.ఎస్. సురేంద్ర, కమిటీ సభ్యులు హరిబాబు, బాలాజీసింగ్, అక్బర్, మెకానిక్‌లు పాల్గొన్నారు.

తీర్మానం లేకుండా డబ్బులు డ్రా చేశారు

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన డ్వాక్రా మహిళలు



మీ కోసంలో తహసీల్దార్ కె.రవిబాబుకు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి స్పందన లభించింది. పలు గ్రామాల నుంచి ప్రజలు రకరకాల సమస్యలపై తహసీల్దార్ కె.రవిబాబును కలిసి తమ గోడును వినిపించారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిర్దేశిత గడువులోపు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించడం జరుగుతుందని అర్జీదారులకు భరోసానిచ్చారు. ఇటీవల జరిగిన భూముల రీ సర్వే సమయంలో తమ భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలతో పాటు చిన్నచిన్న సమస్యలు తలెత్తినట్లు నలుగురు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఇతరత్రా సమస్యలకు సంబంధించి మరో రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

– ప్రత్తిపాడుకు చెందిన పిరానే పీర్ డ్వాక్రా గ్రూపు మహిళలు మీ కోసంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండా రూ. 86,010 తమకు పొదుపు ఖాతా నుంచి సీసీ లోన్‌కు జమ చేశారని, అదేవిధంగా తాము తీర్మానం చెయ్యకుండా రూ. 3,36,000 అప్పు పుస్తకం నుంచి డ్రా అయ్యాయని, దాని వలన తామంతా అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. తమ తీర్మానం పుస్తకాల్లో గ్రూపు సభ్యుల సంతకాలు కూడా ఫోర్జరీ చేసి ఉన్నాయని తహసీల్దార్‌కు వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వెంటనే వీరిపై క్రిమినల్ కేసు పెట్టమని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. తాను కూడా ఎస్ఐతో మాట్లాడుతానని తహసీల్దార్ బాధితులకు చెప్పారు.

వక్ఫ్ భూముల రక్షణ అందరి బాధ్యత

లక్ష్మీపురం: వక్ఫ్ యాక్ట్‌కు బీజేపీ ప్రభుత్వం పలు సవరణలు చేస్తూ త్వరలో పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టనుందని, దీని వల్ల వక్ఫ్ సంస్థలకు ఎంతో నష్టం జరిగే అవకాశం ఉందని ముస్లిం పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీన్ని అడ్డుకోవాలని కోరారు. వక్ఫ్ భూములపై జిల్లా కలెక్టర్లకు అధికారాన్ని కల్పిస్తూ సవరణ తీసుకుని రావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరమని విమర్శించారు.

ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ

పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీ)ల ఏర్పాటుకు సర్వం సిద్ధమైంది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఎన్నుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎన్నికల నిర్వహణపై మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికలు ఎలా నిర్వహించాలనే అంశంపై ఎంఈఓ శ్రీనివాసరెడ్డి వివరించారు.

ప్రగతి నగర్ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కోట మాల్యాద్రి

లక్ష్మీపురం : ప్రగతి నగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి అందరూ కృషి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పేర్కొన్నారు. ప్రగతి నగర్ 6–7 వార్డుల సీపీఐ శాఖల సమావేశం నూతలపాటి చిన్న అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ.. నగరంలోని ఇల్లు లేని నిరుపేదల కోసం సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి విజయం సాధించినట్లు తెలిపారు. ప్రస్తుత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌లు ప్రగతి నగర్ అభివృద్ధికి సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆరో బ్లాక్ కార్యదర్శి ఏసు, ఐదో బ్లాక్ కార్యదర్శి అప్పమ్మ, నాయకులు ఎలీషా, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా విధుల నిర్వహణ అభినందనీయం



గ్లోరీ ఫ్లారెన్స్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: సమర్థంగా 32 ఏళ్లపాటు విధులు నిర్వర్తించిన గ్లోరీ ఫ్లారెన్స్ సేవలు అభినందనీయమని జిల్లా ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్ అన్నారు. మహిళా హోంగార్డు ముక్కు గ్లోరీ ఫ్లారెన్స్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆమెను ఘనంగా సత్కరించారు. పోలీస్‌స్టేషన్లు, క్రైం, ట్రాఫిక్‌తోపాటు పోలీస్ అనుబంధ శాఖల్లో ఆమె అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ రత్నంరాజు, ఏఎస్ఐ మళ్ళ సుధాకర్, హోంగార్డ్ రైటర్ సుధీర్, హోం గార్డులు పాల్గొన్నారు.

ఉమా శంకర్‌కి సత్కారం



పొన్నూరు: మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలకు అరుదైన గౌరవం దక్కింది. శ్రీకాళహస్తికి చెందిన యువతరం సేవా సమితి పదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తిలోని కళావేదికపై నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్న మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు తిరుమలశెట్టి ఉమా శంకర్‌ను సేవా సమితి ప్రతినిధులు మెమెంటో అందించి, సత్కరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు రూరల్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నల్లపాడు పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్నర్‌రింగ్ రోడ్డు రెడ్డిపాలెం నుంచి అక్రమంగా వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి 28 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నారు. బియ్యంతోపాటు, డ్రైవర్‌ను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర బాధ్యతలు స్వీకరణ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎస్ఐగా కె.నాగేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేసిన సోమేశ్వరరావును సుమారు నలభై రోజుల కిందట సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెదకాకానిలో ఎస్ఐగా చేస్తున్న నాగేంద్రను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.